రాజహంసిలా సింహద్వారం దాటిన హేమలత లేడిపిల్లలా పరుగెత్తుకుంటూ వచ్చే పన్నెండేళ్ల సుశీలను చూసి మహారాజును చూసిన వట్టపేనుగులా నిలబడిపోయింది.

శకుంతలను సమీపించిన దీర్ఘాపాంగంలా నిలిచింది హేమలత పక్క సుశీల. ఒక్క క్షణం మాత్రమే అలా నిలబడి - "ఈ చీటీ మా అమ్మ మీ కిచ్చి రమ్మంది, సెలవ్! నమస్తే!" అని ఇంద్రధనుస్సులా వంగి, చక్రకాయిలా తిరిగి గుమ్మం మెట్లు దిగేసింది.

సూరేకారం తక్కువయిన తారాజువ్వలా పోతున్న సుశీలవైపు ఒక్కసారి చూసి, చేతిలో కవరు చూసి అంతలో ఏదో జ్ఞాపకం రాగా -

"సుశీలా!" అని గట్టిగానే పిలిచింది.

పిలిచాక కానీ తను వీధి గడపలో నిలబడి అరుస్తున్నా ననే స్పృహ లేదు. పిలిచేశాక ఆ ఊహ తట్టింది. తట్టగానే నారి బిగించిన విల్లులా వంగి బిగుసుకుపోయింది. అటూ, ఇటూ చూద్దామనుకుంది కానీ చూడలేదు.

మయూర క్రేంకారంలా సాగిన హేమలత కంఠస్వరం సుశీల చెవుల్లో సున్నితంగా ప్రవేశించి వెనక్కు తిప్పి హేమలత దగ్గరకు నడిపించి నిలబెట్టింది.

ఒక్క క్షణం ...

రెండో క్షణం ...

మూడు క్షణాలు ...

ఎందుకు పిల్చిందీ చెప్పలేదు హేమలత.

ఎందుకు పిల్చారని అడగలేదు సుశీల.

సుశీల అడగలేకపోవటం కాదు, అడగదు. అడగకూడదని అమ్మ చెప్పింది.

ఏదో వసుంటే కాని ఎవరూ పిలవరు. పిలిచిన వాళ్లు ఆ విషయం చెప్పకపోతే మనం అడగకుండా ఊరుకోవటం ఎంతో మంచిది. అమ్మ చెప్పిన మాట సుశీల ఆచరణలో పెట్టటంలో అంతవరకూ కృతకృత్యురాలే అయింది. పది పదిహేను రోజుల క్రితం సుశీలకు ఒక గొప్ప ఆలోచన తట్టింది. దాన్ని అమలు జరపటానికి అవకాశం చిక్కక - బోర్లించిన డబ్బాలో గిలగిల్లాడే కప్పగంతులా - జిల జిల లాడుతున్నది ఆ గుంటదాని మనసు. ఈవిడ ముందు ఆ మంత్రం ప్రయోగించాలనుకుంది. తన దివ్యాస్త్రాన్ని అనుసంధానించటానికి సర్వసన్నద్ధురా లయింది కుర్రది.

పెదవి కదల్చకుండా అజంతా సుందరిలా నిలబడ్డ హేమలతను ముందు తన వైపు ఆకర్షించుకోవటానికి నెమ్మదిగా దగ్గింది. దగ్గీ దగ్గుతుండగా హేమలత పిల్లదాని భుజం మీద చెయ్యివేసి, లోపలకు నడిపిస్తూ, "సుశీ! నీకు పరీక్ష లెప్పటినుంచే?" అంది జారుతున్న పైట విలాసంగా సరిచేసుకుంటూ.

# ఇయం గోషా లక్ష్మి

## ఉపశ్రీ

[ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 30-9-1959 సంచిక నుండి పునర్ముద్రితం]

[మార్చి 16 ఉపశ్రీ 67వ జయంతి సందర్భంగా]







"మీలాగే నేనూ స్కూల్లో చదువు మానేశాను!" అంది గ్రీవాభంగాభిరామంగా నిలబడి.

"అదేమిటే?" అని, కొనసాగిన ముక్కు చివర పట్టుకుని ఆడించి వదిలేసింది హేమలత.

"ఔనండీ! మా అమ్మకు చదువు రాకపోతే నేను స్కూల్‌కి వెళ్లి చదువుకోవాలి కానీ ..." అని నవ్వేసింది.

"మరి ఇన్నాళ్లూ ఎందుకు వెళ్లారో తాయిలం గారు?" - సోఫాలో వయ్యారంగా వాలుతూ తన వక్కన కూర్చోబెట్టుకుని, వాలుజడ ముందుకు వేసుకుని అంది.

సుశీల తన జడను భుజం మీదనుంచి ఎదరకు తీసుకుని జడకుచ్చులలోకి బులిబులి వేళ్లు పోనిచ్చి "ఎన్నాళ్లు వెళ్లా నేమిటి? రెండేళ్లు చదివాను. అదయినా కాస్తంత కాలక్షేవం కోసం. ఈ ఏడాదే మానేద్దును. మా అమ్మకు మీరు ఉద్యోగం ఇవ్వకపోతే!" అని ఆపి, నమ్రంగా తల పైకెత్తి చిత్రంగా కన్నులు మిలమిలలాడించింది.

"అమ్మా నాన్నా ఇద్దరూ సంపాదిస్తే మీ రింకా సుఖంగా చదువుకోవచ్చు గాదుటే!" బుగ్గ పుణికి, చేతిలో ఉన్న కవరులోంచి చీటీ తీసి మడత విప్పుతూ అంది.

"అలా అనుకునే అమ్మ జేరింది. కానీ రంగ డన్నయ్యా, నేనూ కూడా ఎంతో వెనకబడిపోయాం చదువులో. అందుకే మా అమ్మ ఉద్యోగం మానేసింది. ఆ ఉత్తరం చదివితే మీకు పూర్తిగా అర్థమవుతుంది. వస్తా!" అంటు సిసింద్రీలా దాటేసింది.

మొలకెత్తుతూన్న, చిరునవ్వుని సును బుగ్గ సొట్టలతో సుడి తిప్పుతూ, జెర్రిలా జారిపోయే సుశీలవైపు చూసి ఉత్తరంలోకి దృష్టి పోనిచ్చింది.

*** **** *****

"డియర్ హేమా!

మీ నాన్నగారికి నా అభివాదాలు.

నువ్వు నా యందు చూపించిన ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు. నా సంసారాన్ని శోభామయం చేసుకోవాలనీ, నా పిల్లల భవిష్యత్తును సుందరతరం గావించుకోవాలనీ నేను నీ సలహా స్వీకరించానని ఎరుగుదువు. నన్ను కూడా కన్నకూతురులానే చూసుకునే మీ నాన్నగారి ప్రెస్సులో ఉద్యోగం చేయటం నా అదృష్టంగానే భావించాను. నా భావనలో ఎంతమాత్రం దోషం లేదని అనుభవం మీద తెలుసుకున్నాను.

కానీ, నేను ఏ లక్ష్యంతో ఉద్యోగం స్వీకరించానో సాగదని మూడో నెలలోనే తెలుసుకున్నాను. దేశంలో మంచి పేరు తెచ్చుకున్న 'తెలుగు వాణి' పత్రికలో అచ్చుతప్పు ఒకటి వర్తా నా మనస్సు కించపడుతుంది. అందుకే రాత్రి ఎనిమిదయినా నేను ప్రూఫ్‌ల దగ్గర నుంచి కదిలేదాన్ని కాదు. నువ్వూ నాతో సమంగా శ్రమపడేదానివి. ఒకవైపు ప్రెస్ అకౌంట్స్ చూస్తూ, రెండో వైపు అచ్చు తప్పులు దిద్దుతూ నా జీవితాన్ని ప్రత్యేకమైన ఏ లక్ష్యం లేకుండా నడిపేస్తున్నాను. జీవితంలో మరీ 'గుమాస్తా యంత్రం'లా తయారయిపోతుంటే భరించలేకుండా ఉన్నాను.

ఇవన్నీ ఎలా ఉన్నా వచ్చే నెల నుంచీ ఆయన జీతం ముప్పై రూపాయలు పెరుగుతున్నది. పైగా ఈ మధ్యకాలంలో ఆయన రాసి పడేసిన రేడియో నాటికలూ, కథలూ, నవలలు ఫెయిర్ చేయాలి. అవి పూర్తి చేస్తున్నా నేను కొంత సంపాదించుకోగలుగుతాను. అన్నిటికన్నా ముఖ్యం నాకు నా పిల్లలు.

మొన్న రాత్రి వరకూ నా పిల్ల లిద్దరూ నన్ను చూసి భయపడుతున్నారని నాకు తెలియదు. ఆ రాత్రి నేను ఇంట్లోకి వస్తూండగా - "అమ్మ తిట్టినా బావుండునురా, అసలు పలకరించకుండా ఉండేకంటే" అంటూన్నది సుశీల.

కన్న తల్లి చెవిలో వర్త ఆ వాక్యం ఎంతగా హృదయాన్ని మెలిదివ్వుతోందో ఒక్కసారి ఊహించు. పిల్లల కోసం బెంగటిల్లే నీకు ఇలాటి ఊహాలు బాధ కలిగిస్తాయని నాకు తెలుసు."

అంతవరకూ లేత తమలపాకులాంటి అరచేతిలో బింబాధరం బిగించుకు కూర్చున్న హేమలత కన్నులు చెమ్మగిల్లాయి. ఆమెకు తెలియకుండానే ఆమె సోఫాలో వెనక్కు వాలి గుండె మీద చేతులు వేసుకుంది. బలీయమైన ఆకాంక్ష హృదయంలోంచి దూసుకువచ్చి కనుల్లో కలవరపడుతున్నది. ఆమె కన్నులు అర్థ నిమీలితా లయాయి.

అతి కష్టంమీద మళ్లీ ఉత్తరం వైపు దృష్టి సారించింది.

"కానీ ఏం చేయమంటావు, ఈ రోజున నేను ఈ వివరణంతా చేయకపోతే నేను మరేదో కారణంచేత ఉద్యోగం మానేసి ఉంటానని నువ్వు బాధపడతావు. ఆ అనుమానం కలగకుండా ఉండటానికే ఇంత రాస్తున్నాను.

"లతా! మ నిద్దరం ఒక ఊరువాళ్లం. ఒక ఈడువాళ్లం. మనిద్దరం వరుసగా ఒకేచోట చదువు సాగించాం. ఆఖరుకి ఈ ఊళ్లో కాలేజీలో కూడా మనిద్దరం కలిసే చదివే అవకాశం లభించింది. మనం జేరిన వారం రోజుల కనుకుంటా - ఇక్కడి కాయన లెక్చరర్‌గా వచ్చారు. కొత్తగా యూనివర్సిటీ నుంచి పట్టా పుచ్చుకుని వచ్చి ఇక్కడ పాదం పెట్టారు. మొదటి రోజున

క్లాసుకు మనకంటే భయపడుతూ వచ్చా రాయన, గుర్తుందా!


"అయన కుర్చీలో కూర్చోబోతుండగానే మన క్లాసు అబ్బాయిలు కొంచెం గొడవ ప్రారంభించారు. కూర్చోబోతున్న అయన అలానే లేచేసి నిలబడి ఇంగ్లీషులో ఒక అరగంట ఉపన్యాసం ఇచ్చి వెళ్లిపోయారు. ఆయన మాట్లాడుతున్నంతసేపూ అందరూ నాగస్వరం వింటున్న నాగుపాముల్లా ఉండిపోయారు. తెలుగు మాస్టారు ఇంగ్లీషులో అంత అనర్గళంగా మాట్లాడటం, ఎన్నెన్నో ప్రాపంచిక వైజ్ఞానిక విషయాలను గురించి ప్రసంగించటం మన కెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. అయన దగ్గర చదువుకోవటంకంటే మనకు మహాభాగ్యం లేదనుకున్నాం, గుర్తుందా? ఆ తరువాయి ఆయనకూ, నాకూ మధ్య 'బిల్హణీయం' సాగటం, అది కొంత మా ఇద్దరి జీవితాలకూ కళంకం కాబోవటం - ఆ సమయంలో నువ్వు మీ నాన్నగారిని రంగస్థలం మీదికి తెచ్చి మా ఇద్దరికీ పాణిగ్రహణం జరిపించటం, అంతటితో నేను చదువు మానేయటం, బి.ఏ.లో జేరి కూడా నేను మానేశానని నువ్వు స్వస్తి చెప్పటం - ఈ విధంగా మనిద్దరి జీవితాల్లో సాగించిన యాత్రను మళ్లీ సన్నిహితం చేసుకోవాలనే సంకల్పంతో నువ్వు ఉద్యోగం ఇవ్వటం - ఇన్ని ఉపకారాలు నువ్వు చేసినా, నేను నా మాట మీద నిలబడి ఉద్యోగం చేయకపోవటం కన్న అన్యాయం లేదని నాకు తెలును.

తెలిసినా ఇంకో దారి లేనప్పు డేం చెయ్యను. ఉద్యోగం విషయం నన్ను ఒప్పించడానికి నువ్వు సౌభాగ్యం, పద్మ చెప్పిన కారణాలు కూడా నా పిల్లల భవిష్యత్తేగా. అది పూర్తిగా దెబ్బ తింటూన్నప్పు డింక నా ఉద్యోగ ప్రయోజన మేమిటే?

పన్నెండేళ్లు వచ్చేవరకూ మా అమ్మ దగ్గర చదివిన భారత, భాగవతాలూ, ఫోర్త్ ఫారం నుంచి స్కూల్ ఫైనల్ వరకూ మీ నాన్న దగ్గర చదివిన తెలుగు ప్రబంధాలూ, సంస్కృత నాటకాలూ, ఇక్కడ కాలేజీలో చేరాక మీ నాన్నారు తెప్పించిన మాడరన్ లిటరేచరూ మన కిచ్చిన జ్ఞానం సక్రమంగా వినియోగ యోగపరచుకోవాలి గదా! ఆ ఊహతోనే నేను పిల్లలిద్దర్నీ స్కూల్‌కు పంపకుండా శిక్షణ ఇచ్చాను. మరీ ఇల్లు కదలకపోతే సౌకుమార్యంతోపాటు పిరికితనం బలుస్తుందని తరువాయి చేర్చాను. రెండు మూడేళ్లు స్కూలుకి పంపి మళ్లీ మానిపిద్దామనే అలా చేశాను. నలుగురితో కలిసి తిరగటం, పదిమందిలో నిలబడి మాట్లాడటానికి భయపడకపోవడం వస్తే చాలు, స్కూలు మానిపిద్దా మనుకున్నాను. ఈ రెండూ అలవాటు కాకపోతే ఇక ఈ రోజుల్లో స్కూలు కెందుకే? ఇప్పటి మూర్ఖల్ల తెలివి నీకు తెలియదూ! మనతో వచ్చి ఇక్కడ కాలేజీలో చేరింది, గుర్తుందా? మొన్న డిసెంబరులో అది ఎక్స్‌మస్ డిన్నర్‌కి పిలవటానికి వచ్చిననప్పుడు -

'శిలలు ద్రవించి యేడ్చినవి ...' అనే పద్యం మీ కెలా ఉందండీ అని మీ బావగారు అడిగితే, 'పోనిద్దురూ, ఆ పుస్తకాలతో కాలేజీలో చస్తూనే ఉన్నాం' అని వెళ్లిపోయింది.

ఇలాంటివాళ్లు తర్ఫీదిస్తూంటే ఇంక చదువుకునేవాళ్లకు వచ్చి చచ్చే దేమిటే? అందుచేతనే కాలేజీల్లో చదువూ, సంస్కారం కంటే



అల్లరీ, అకతాయితనం ఎక్కు వవుతున్నాయి. మనం సీనియర్ చదువుతుండగా తెలుగు డిపార్ట్‌మెంట్‌లోకి ఆచార్యులుగారు వెళ్లాక వచ్చిన పంతులుగారి సంగతి గుర్తుంది కదూ! ఏ ప్రశ్న అడిగినా 'ప్రిపేర్' అవలేదనీ, అది మీ కనవసరమనీ జారిపోయేవారు. అయన ఒక్కరి క్లాసులోనూ ఎంత అల్లరి జరిగేదో గుర్తుందా! అదే టైములో మన పక్క గదిలో మీసాల రాజుగారి క్లాసూ అంతే అధ్వాన్నంగా ఉండేది. ఏమిటో కాలేజీ స్మృతి వచ్చేసరికి ఇవన్నీ ఒక్కొక్కటే గుర్తుకొస్తున్నాయి.

ఇంతకూ అసలు విషయం ఏమిటంటే కాలేజీలోనూ, నగరంలోనూ మాత్రమే గాక దేశంలో ప్రసిద్ధ రచయితగా పేరు గడించుకున్న వ్యక్తికి భార్యగా నేను నా వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవాలనే గాఢమైన కోరిక నాలో పులకలెత్తించి, మొలకెత్తుతున్నది. అందుకు తగిన కృషి రేపు విజయదశమి నుంచి ఆరంభిస్తున్నా నాలో ఈ ఆత్మ పరిశీలన కలిగి హృదయావిష్కారం చేసుకోవాలనే వాంఛ రేకులు తొడగటానికి నువ్వు ఇచ్చిన ఉద్యోగం కారణం. అందుకు నిన్నూ మీ నాన్నగారినీ అభినందిస్తున్నాను. ఇది చదివి వెంటనే వచ్చి నన్ను కలుసుకుంటావు కదూ!

"నీ - భామతి."

ఉత్తరాన్ని ముగిస్తూనే హేమలత భారంగా నిట్టూర్చి పైట చెంగుతో నుదురు మీద పట్టిన చెమట ఒత్తుకొని చిటికెన వేలి నున్న ఉంగరాన్ని తిప్పుతూ అడుగులు వేసింది.

• • •

"నా ఉత్తరం చదవగానే నువ్వు వచ్చి తీరతావనుకున్నాను" అంటూనే కలం మూసి డ్రాయర్ మీద పెట్టి, అంతవరకూ రాసిన కాగితాలు బొత్తు పెట్టి పక్కనున్న కుర్చీ మరికాస్త దగ్గరగా లాగి ఆహ్వానించంది భామతి.

హేమలత ముఖంలో ఏ విధమైన ఆవేగమూ లేకపోగా, ఆశ్చర్యం కూడా కనబడకపోవటంతో కొద్దిగా చకితురాలైంది భామతి. కాలేజీలో చదువుకునే రోజుల్లో ఉండే ప్రశాంత గంభీరంలో గాంభీర్యం కూడా లేకుండా ప్రశాంతంగానే ఉండటం మరికాస్త ఆలోచనను రెట్టించింది. భామతి దగ్గర కూర్చున్న హేమలత ఫిజిక్స్ క్లాసులో కూర్చుంటున్నట్లు భావరహిత నేత్రాలతో ఉండటం కొంచెం బాధనే కలిగించింది. భామతి మనస్సులో కలిగే ఈ ఊహా చలనాన్ని హేమలత గుర్తించకపోయినా, తన రాక ఏదో ఒక సంచలనాన్ని కలిగిస్తుందని ముందే ఎరుగును. ఆ సంచలనం నుంచి భామతి విముక్తురాలయేవరకూ తా నేమీ ప్రసంగించకూడదనుకుంటూ వచ్చింది. అనుకుంటూ వచ్చిందే కాని, వచ్చిన తరువాయి ఎదుటి వ్యక్తి మనసులో కలిగే ఆలోచనా స్రవంతి ఎటు సాగుతున్నదో ఎంతవరకూ సాగక నిశ్చల సాగర సంగమం చేస్తుందో గ్రహించటం కష్టమనుకుంది. కష్టమనుకుంది కనుకనే -

"నువ్వు నా ఊహలన్నిటినీ భగ్నం చేశావే" అనేసింది.

ఏ వాక్యంతో తాను ప్రసంగాన్ని ప్రారంభించకూడదనుకుంటూ వచ్చిందో, అదే వాక్యం ముందుగా వచ్చేసింది. వచ్చేసిన తరువాయి కాని జరిగిన ప్రమాదాన్ని తెలుసుకోలేదు. కానంతలో బాధపడ నవసరంలేదు. అవసరం లేదనుకుంటే సరిపోతుందా! సరిపోదు కనుకనే - "దానికేం గాని ఏమిటి రాస్తున్నావ్?" అంది ఏమీ జరగనట్టు. జరిగినా అది మరిచిపోవాలని మరచిపోతున్నట్టూ అనుకుని.

అనుకున్నది హేమలతే కాని భామతి కాదు. ఆ అనుకోవటం కూడా పూర్తిగా అనుకోవటమే. అక్షరాలా అనుకోవటం అనేది హేమలత మనస్సులో జరిగిన వ్యాపారం. లత మనో వీథిలో జరిగే వ్యాపారాన్ని ఆమె కన్నులు ఎంతమాత్రం బహిర్గతం చెయ్యవు. మనో యవనికపై సాగే ప్రతి దృశ్యాన్నీ కన్నులు ప్రతిబింబిస్తాయనే విశ్వాసం కల విజ్ఞుల్ని హేమలతముందు పది నిముషాలు కూర్చోబెడితే వారు తాము నమ్ముతున్న సిద్ధాంతానికి నివాపాంజలు లిచ్చి రెండుకళ్లూ తుడుచుకు చక్కా వస్తారు.

భామతి హేమలత ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా, "చిట్టీ తల్లీ! లత అత్తయ్యకు కాఫీ ఇస్తావా?" అని పక్క గదిలో శ్రద్ధగా కూర్చుని, బుద్ధిగా చదువుకుంటున్నట్టు అభినయిస్తున్న సుశీలవైపు చూసింది.


సుశీల ఏమీ మాట్లాడకుండా పరికిణీ కుచ్చెళ్లు ఎత్తిపట్టుకుని విజయ గర్వంతో హేమలతవైపు చూస్తూ ఫ్లాస్కు తీసుకొచ్చి మేజామీద పెట్టి, అలానే చూస్తూ వంటింట్లోకి నడిచి కప్పూ, సాసరూ తెచ్చింది.

"అయితే, లతా! దసరా సంచిక బైండింగ్ అయిపోయిం దేమిటే?" అంది భామతి - కాఫీ కప్పులోకి పోసి అందిస్తూ.

"ఏం, ను వ్వేదన్నా రాస్తున్నావా? మన పత్రికకు మామూలేగా! పత్రికంతా పూర్తి అయ్యేసరికి ఏ కవిసమ్రాట్ నుంచో విమర్శ వ్యాసమో, మల్లంపల్లి శర్మగారి దగ్గర్నుంచి చారిత్రక రూపకమో రావటం, అందుకోసం ప్రత్యేక సంచికను వారం రోజులు ఆలస్యంగా అందజేస్తూండటం!" అని సగం పెదవుల్ని కదిలించి, ఒకే వైపునకు నవ్వును కేంద్రీకరించింది.

హేమలత వాక్యంలో ఉన్న అంతరార్థం భామతికి తెలుసు. తాను ఆ కార్యాలయంలో చేరాకనే విజయదశమికి, సంక్రాంతికి అటువంటి ఆలస్యం సంభవించింది. దాన్నే హేమలత ఎత్తిపొడుస్తున్నదని తెలుసు. నీకు కెమిస్ట్రీ మాస్టారి సన్‌క్ష్యూయాలిటీ బాగా పట్టేసింది అని తరచు తనే అనేది.

"ముందు కాఫీ తీసుకో! అదీకాక, ఒసేయ్! ఈ




వచ్చేశాడు.

"అలా నిలబడిపోయావేమే, లతా! ఇలా కూర్చో! ఏం, ఈమధ్య పూర్తిగా ఈవైపు రావటమే మానేశావు!" అని స్వాగత సూక్తం వలికింది భామతి.

వక్క గదిలో రంగడూ, సుశీలా ఏమీ అర్థం కాక ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"అందుకేగా క్షమార్పణ కోరుతూ విందు భోజనానికి ఆహ్వానించటాని కొచ్చాను! అవునూ, మీ రంగ డేడీ? వాడిదీ, నాదీ పుట్టిన రోజు ఒకే తారీఖని చెప్పాడు. వాడి పుట్టినరోజు ఎల్లుండేనా?" అంది హేమలత మామూలుగా జారిపోయే పైటను నృత్య భంగిమలో పైకెత్తుతూ.

"వాడు వడుకున్నట్టున్నాడులే! నీ పుట్టిన రోజు విషయం చెప్పిపోవటానికే వచ్చావా? అలా కాస్సేపు కూర్చో! ఊఁ, మీ పేపరు బాగా నడుస్తోందా? ఏమైనా ఈమధ్య దేశంలో సంపాదకులకంటే పాఠకుల సంఖ్య పెరిగినట్టుంది" అని నవ్వాడు ప్రకాశం.

"ఈ పదేళ్ల నుండీ చూస్తున్నాం కానీ, మాస్టారూ! మీ వ్యంగ్య ధోరణి మారలేదండీ!" అంటూనే నవ్వింది - మునివేళ్లతో పెదవి చివర రాసుకుంటూ.

"మీ ఇద్దరిలాంటి స్టూడెంట్సు ప్రతి ఏడూ జేరుతూంటే ..." అని, వాక్యాన్ని మధ్యలోనే తుంచేసి, జేబులోనుంచి సిగరెట్ పెట్టె తీశాడు.

భామతి చటుక్కున లేచి వెళ్లి అగ్గిపెట్టె తీసుకొచ్చింది.

"వీటన్నిటికీ ఏం గానీ, మాస్టారూ! నే నో పెద్ద పని మీద వచ్చాను. చెప్పమంటారా? దురభిప్రాయపడనంటే చెప్తాను. ఈ రోజుల్లో నేను ఏం మాట్లాడుతున్నా శనిలో శని నడుస్తున్నట్టే ఉంటోంది."

"నీ క్కూడా మీ నాన్నారు జ్యోతిష్యం పట్టిస్తున్నా రేమిటి?" అని అడ్డేశాడు ప్రకాశం.

"నేను చెప్పదలచుకున్నది చెప్పనివ్వండి. మీరు కాలేజీలోనూ ఇలాగే దాటించేసేవారు కొన్ని చిక్కు సన్నివేశాల్లో!" అని హేమలత ఒక్క క్షణం ఆగి, కొనగోటితో కనురెప్పల కింద రాస్తూ -

"నువ్వు కూడా వినాలే! నాన్నారు పత్రికతోపాటు ప్రెస్ కూడా మేనేజ్ చేసుకోలేక చాలా ఇదవుతున్నారు. పైగా నేను ఆయనకు ఏ విధంగానూ సహకరించలేకపోగా జీవితాన్ని భారంగా నిర్వహిస్తున్నాను. అందుకని ప్రెస్ బాధ్యత నా నెత్తిమీద పెట్టుకుంటున్నాను. నువ్వు నాకు చెయ్యవలసిందల్లా పత్రిక ప్రూఫ్‌లు దిద్దుతూండటం, కాస్తంత అకౌంట్స్ చూస్తూండటం చేస్తే చాలు. నీకు కూడా ఇంట్లో అంత బాధ్యత లేమీ లేవు గనక అడుగుతున్నాను.

"నాన్నా రింక బాధ్యత లన్నీ వదుల్చుకునేలా ఉన్నారు. ఆయన పర్యవేక్షణలోనే నే నివన్నీ నేర్చుకుందా మనుకుంటున్నాను. తోడు లేకపోతే నే నేమీ చెయ్యలేను. నువ్వు మానేశావనే నేనూ కాలేజీ చదువు మానేశానని ఎరుగుదువు కదా! అందుచేత నువ్వు నా కీ సహకారం చేస్తానని వాగ్దానం ఇయ్యి.

"అయితే ఆ పని కూడా నువ్వు ఉత్తినే చెయ్యనక్కరలేదు. నెలకు నూట పాతిక నువ్వు వద్దన్నా ఇస్తాను. అంతమాత్రంచేత నువ్వు నా దగ్గర ఉద్యోగం చేస్తున్నా నని అనుకుని భయపడనక్కరలేదు. నీ ఇష్టం వచ్చినప్పుడు ఆఫీసుకొచ్చి వెళ్లవచ్చు. మాస్టారూ! నా ప్రస్తావనలో లోపం ఉంటే క్షమించండి. బాగా ఆలోచించుకోవే! రేపు మధ్యాహ్నం నేను మళ్లీవస్తాను. సెలవు, మాస్టారూ!" అనేసి చేతులు జోడించి రెండడుగులు వెనక్కు నడచి నెమ్మదిగా వెళ్లిపోయింది.

ఒక్క క్షణం ప్రకాశం అటే చూశాడు.

భామతి మనసులో ఏవో ఆలోచనలు గిరగిర తిరుగుతున్నాయి. ప్రకాశం కన్నులు నెమ్మదిగా భామతి ముఖంలో కలిగే భావ సంచలనానికి తన మనస్సులో ఆకృతిని కల్పించడానికి ప్రయత్నిస్తున్నాయి.

తర్జన భర్జనలు చాలా జరిగాక హేమలతకు సహాయపడటం మాట ఎలా ఉన్నా తన సాంసారిక స్థితిగతులను చక్కబరచుకోవటానికయినా ఉద్యోగం చెయ్యాలని నిశ్చయించుకుంది భామతి. ఆయన రెండు వందల పాతిక తెస్తున్నా పైగా అటూ, ఇటూ పాతికా ముప్ఫయ్యీ పత్రికల నుంచీ, రేడియో నుంచీ వస్తున్నా బొటాబొటీ అవుతున్నది. ఇంటికొచ్చే అతిథుల సంఖ్యలో మార్పు లేదు. వచ్చినవారికి మర్యాదభంగం చేయటం ఎంతమాత్రం ఇష్టం లేదు. పైగా ఆయన ఔదార్యం కొంతయితే తన దానధర్మాలు మరికొంతయి నెలాఖరు రోజుల్లో చేతుల్లో దమ్మిడీ లేని స్థితి ఏర్పడుతున్నది.

ఆయన చేతిలో ఏమీ లేదని ఎరిగి ఉండీ ఎల్లుండి రంగడి పుట్టినరోజని చెప్పింది. అప్పుడే అతని ముఖం విషాదాచ్ఛాదిత మయింది. సాధ్యమైనంతవరకూ అప్పు చెయ్యకుండా కాలం గడపాలని ఆయన ఉద్దేశం. అందుకు తనూ సుముఖురాలే. కానీ పెద్ద కొడుకు పుట్టినరోజు!

మొదటి కానుపు మీద సహజంగా స్త్రీకి ఉండే అభిమానమే తనచేత అలా పలికించింది. ఆ విషయం ఆయన కూడా ఎరుగుదురు. కానీ, ఎంత ఉదాత్తమయిన మనిషి అయినా కొన్ని కొన్ని వేళల్లో చాలా దిగజారిపోతాడు. ఆ దౌర్బల్యంతోనే అతను సాయంత్రం ఇంటికి ఆలస్యంగా వచ్చాడు. అదీ తెలుసు భామతికి. సాధ్యమైనంతవరకు ఇటువంటి సమయాలలో ఉపయోగపడేందుకు చేతులలో నాలుగు రాళ్లుంటాయనీ, పైగా పిల్ల లిద్దరూ స్కూలుకి వెళ్లిపోతే ఇంక ఇంట్లో తన కేమీ తోచటంలేదనీ, అదనీ ఇదనీ చెప్తూ తమలపాకుల చిలకలు చిటికెన వేలి చివరనుంచి నోటికి అందిస్తూ తన నిశ్చయాన్ని భర్తతో చెప్పింది.

"నువ్వూ చదువుకున్నదానివి. కష్ట సుఖా లెరిగినదానివి. అందుచేత నీకు ఎలా చెయ్యాల్నుంటే అలా చెయ్యి!" అంటూ దానివల్ల కలిగే ప్రయోజనాలనూ, నష్టాలనూ వివరించాడు ప్రకాశం.

అన్నీ విన్నాక కూడా భామతి ఉద్యోగంలో చేరటానికి నిశ్చయించుకుంది.

మరునాడు హేమలత ఇంట్లో జరిగిన విందులో కూడా ప్రమీల, సుందరి, లలిత, సరోజిని, భాగ్యం అందరూ భామతి ఉద్యోగం చేయటం వల్ల పిల్లల భవిష్యత్తుని ఇంకా బాగుచేసుకోవచ్చు నన్నారు.

అంతటితో భామతి ఉద్యోగం రంగవల్లి తీర్చిదిద్దుకుంది.

***　　***　　****

హేమలత అంతవరకూ చదివి మిగిలిన కాగితాల కోసం లేచింది.

"ఎవరదీ?"

వీధి గడప ఎక్కి తలుపు తోస్తుండగా ప్రకాశం చెవుల్లో పడింది భామతి స్వరం -

"నేనే!" అని లోపలికొచ్చి ఒక్క క్షణం ఆగాడు.

ఆగిన ప్రకారం కన్నులు ఎదురుగా ఉన్న కిటికీ అవతల మంచం మీద పడుకుని పేపరు చదువుతూన్న భామతి మీదకు నడిచాయి.

ఇదివరలో ఎంత పొద్దుపోయి వచ్చినా పిల్ల లిద్దర్నీ కూర్చోబెట్టుకుని పాఠం చెప్తూనే, అంత క్రితం రోజున తాను రాసిన నాటికనో, కథనో ఫెయిర్ రాస్తూనే ఉండే ఆమె ఈనాడు -

ప్రకాశం మనస్సు చివుక్కుమంది.

భారంగా నిట్టూర్చి గోడమూల జోడు విడిచేసి, మడత మంచంమీద తడీ పొడిగా ఉన్న లుంగీ చుట్టబెట్టుకుని బట్టలు విడిచేసి, డ్రాయరు మీద టిన్నులోంచి సిగరెట్ తీసి ముట్టించి, ఒక్క క్షణం విశ్రాంతి తీసుకుందా మనుకుంటూనే పక్క గుమ్మం దాటి పడుకున్న భామతి మంచం దగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

భామతి కన్నులు కదల్చకుండానే - "నేనే అనుకుంటుంటే నాకన్నా ఆలస్యంగా వస్తున్నారు మీరు. అప్పుడే తొమ్మిదిన్నరయింది. తొందరగా భోజనం చేసెయ్యరాదూ!" అని, తన దృష్టిలో తాను ఉండిపోయింది.

ప్రకాశం జడభరతుడిలా నూతి దగ్గరకు నడిచి చేద నూతిలో వేశాడు.

మార్చి నెల ప్రవేశిస్తున్న దనగా రోజా రాత్రిపూట వేణ్ణీళ్లు పెట్టి, గోరువెచ్చగా తోడి అందిచ్చే భామతి -

ఆలోచిస్తూ ఖాళీ చేద పైకి లాగేశాడు. లాగేశాక తెలిసింది.. తెలిసీ తెలియగానే చేద మళ్లీ నూతిలో వేసి గబగబా రెండు మూడు చేదలు నెత్తిమీద దిమ్మరించుకుని అటూ, ఇటూ చూశాడు.

లేదు - నబ్బు బిళ్ల లేదు.

కాళ్లూ, చేతులూ ఉన్నాయా నబ్బు బిళ్లకు.

నబ్బు బిళ్లకు లేకపోయినా ఆ రెండూ ఉన్న భామతి తెచ్చి ఇవ్వకూడదూ!

ఇవ్వకూడ కేం?

ఇదివరలో రోజా ఇవ్వకుండానే గడిచాయా.

గడిచిన రోజులు తలపు కొచ్చేసరికి ప్రకాశం కన్నులు చెమ్మగిల్లాయి.

నూతి పళ్లెం దిగేసి తువ్వాలు కోసం చూశాడు.

చూసినంతలో తువ్వాలు ఊడిపడుతుందా!

పడలేదు కనుకనే పక్క నులకమంచం మీద ఉన్న సుశీల పరికిణీతో తుడిచేసుకుని, అదే చుట్టబెట్టుకుని లుంగీ విప్పబోయాడు. ఆ సన్నివేశం అతనిమీద అతనికే జాలిని కలిగించింది.

పరికిణీ అక్కడే పారేసి, లుంగీ చివరలు గట్టిగా పిడిచి, లోపలకు నడిచి, కాలేజీ నుంచి వచ్చి విడిచిన పంచెనే మయానికి మడతపెట్టి, కట్టుకుంటూ బయటకొచ్చాడు.

బయట కొచ్చేలోపునే కుడిచేతివైపు ముక్కాలి పీట మీద ఉన్న దీపాన్ని ఆర్పేసి ఫాన్ దాని మీద పెట్టి వెల్లకితలా పడుకుంది భామతి.

ప్రకాశం నెమ్మదిగా వచ్చి మడతమంచాల మీద నిద్రపోతున్న పిల్ల లిద్దరినీ చూసి వంటింటివైపు నడిచాడు.

భామతి పక్కకు జరిగి దీర్ఘంగా శ్వాస వదిలింది.

ప్రకాశం వంటింటి గుమ్మంలోనే నిలబడి, గడప కడ్డంగా తల పెట్టుకుని నిద్రపోతున్న వంటమనిషిని చూసి, బుద్ధదేవుడిలా ధ్వనిరహిత హాసంతో వెనుతిరిగాడు.

వెనుదిరిగి రెండడుగులు వేశాడో, లేదో పిల్ల లిద్దరూ మంచం దిగి ఊచల్లా దూసుకుంటూ వచ్చి తండ్రి చేతులు పట్టుకుని - "నడు, నాన్నా! అన్నం తినకుండా పడుకోటానికి వీల్లేదు!" అంటూనే రంగడు ముందడుగు వేసి.

"పుల్లమ్మగారూ! మీరు వెళ్లిపోవచ్చు!" అని అరిచాడు.


"తప్పు, రంగా!" అని ప్రకాశం అంటూండగా ఉలిక్కిపడి లేచింది వంటావిడ.

"మీరు ఎనిమిదింటి వరకూ చూసి వెళ్లిపోతూండండి!" అన్నాడు ప్రకాశం.

"అసలు రేపట్నుంచి రావద్దని చెప్పు, నాన్నా!" - రంగడి వాక్యం వినకుండానే చెంగు దులుపుకు చక్కా పోయింది వంటావిడ.

చకచక సుశీల లోపలకు నడిచి పీట వాల్చి, కంచం పెట్టి, పాదాల మీద వేలాడే పరికిణీ వెనక్కు గోచీ పెట్టి, నేతి గిన్నె పొయ్యిలో పెడుతూ - "రంగా! నువ్వు వెళ్లి ఆవకాయ - జాడీలోది తీసుకొచ్చి వెయ్యరా!" అని కూర, అన్నం వడ్డించేసింది.

ప్రకాశం మనస్సు గిలగిలలాడింది.




కిలకిలలాడుతున్న అతని హృదయం మాత్రం మూగ బాధను అనుభవిస్తూనే ఉంది. మౌనంగా చేతుల్లోకి నీళ్లు తీసుకు చల్లాడు.

లేబొరేటరీ నుంచి వెయిటింగ్ రూమ్‌కి చేరిన డిగ్రీ క్లాసు అమ్మాయి ముఖంలోని ప్రశాంతత వాతావరణంలో ఉంది. ఆమె మనసులోని వ్యథతో పోటీ పడుతున్నది ప్రకాశం మనస్సు.

వంటింట్లో చీమ చిటుక్కుమన్నా వినిపించుకోగలిగినంత నిశితంగా పనిచేస్తున్నాయి భామతి శ్రవణేంద్రియాలు.

"పోనీ, అమ్మ ఉద్యోగం చేస్తున్నది కనుక నువ్వు కాలేజీలో ఉద్యోగం వదిలేసి ఇంటిదగ్గర ఉండిపోకూడదూ, నాన్నా!" అంది మెల్లగా సుశీల.

సుశీల ఈ వాక్యం ముగించేలోగా రంగడు నాలుగుసార్లు బెదిరే కళ్లతో గుమ్మంలోంచి తల్లి వైపు చూశాడు.

[భామతి పెదవులు జయ్యన లేచే చిచ్చుబుడ్డి కాంతుల్లో మెరిసే పసిపాప ముఖంలా కదిలాయి.]

"చిట్టితల్లీ! అమ్మా నేనూ కూడా ఉద్యోగాలు చేస్తే మీ రిద్దరూ ఎంత ఆనందంగానైనా చదువుకుంటూ, హాయిగా ..." అని పిల్ల కన్నుల్లో కన్నులుంచాడు.

"ఏమి హాయి, నాన్నా! నిన్న రంగణ్ణి లెక్కలు సరిగ్గా చెయ్యలేదని క్లాసులో నిలబెట్టారు. మా ఇంగ్లీషు మాస్టారు నన్ను ఏమన్నారో తెలుసా?"

సుశీలను పూర్తిగా చెప్పనివ్వకుండా రంగడు అడ్డుకుని - "అన్నాలు తినేటప్పుడు ఇలాంటి మాట లేం చెప్పకూడదని అమ్మ ఎన్నిసార్లు బోధించిందే మనకి!" అన్నాడు.

## రీసెర్చ్!

వదినా! మీ వారు రిసెర్చి చేస్తున్నారట కదా! దేని మీద చేస్తున్నారు? పక్కింటి కాంతం అడిగింది శాంతాన్ని.

శాంత: అవు నొదినా! కొత్త కొత్తముగ్గులు కనిపెట్టడంలో రీసెర్చి చేస్తున్నారు. దానికోసం అమెరికా వెళ్లొచ్చారు కూడాను.

కోట శ్రీదేవి [శృంగవరపుకోట]

"అవుననుకో! ఇదివరకంటే అమ్మా నాన్నా నువ్వూ నేనూ రోజూ ఓ గంటయినా డాబా మీద కూర్చుని సుఖంగా మాట్లాడుకునేవాళ్లం కనుక అవ్వు డది సాగింది. ఇప్పుడు మరి అమ్మకు ఇంటి దగ్గర ఉండటానికే తీరిక లేదు. ఒకవేళ ఉన్నా ఏదో సీరియస్‌గా చదువుతూనో, ఆలోచిస్తూనో ఉంటుంది!"

సుశీల చెప్తుండగా ప్రకాశం దృష్టి అప్రయత్నంగా దొడ్డి వాకిట్లో పడుకున్న భార్య వైపు నడిచింది. పక్కకు ఒరిగి పడుకున్న భామతి తలగడాలో తల ముంచేసి మంచాన్ని నల్లిలా అంటిపెట్టుకుపోయింది.

సుశీల చెప్తూనే ఉంది.

"నాన్న సరేసరి! ఒక పనేమిటీ? కమిటీ కాలేజీలో కావలసినన్ని వ్యవహారాలు. ఏ ఆచారిగారో వచ్చి ఈ పూట కాస్తంత మా సంగీత రూపకం రిహార్సల్స్‌కి హాజరు కావాలంటారు. లేకపోతే గోపాలంగారు దగ్గరగా జేరి గుండెల్ని చీల్చేసే తేలిక మాటలతో మంచి పాట రాయమంటారు. అదీ, ఇదీ కాకపోతే కెమిస్ట్రీ బాబూరావుగారు తాను కొత్తగా రాసిన కథ వినమంటారు!"

"చెల్లీ! ఏమిటో నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడేస్తున్నావు?" కొంచెం తీవ్రంగా అన్నాడు రంగడు.

సుశీల మెల్లిగా నవ్వుతూ - "అవున్రా, రంగా! నాన్న దగ్గర ఇలా కూర్చుని మాట్లాడి నాలుగు నెలలయింది, తెలుసా?"

బేలగా తన వైపు చూసి పలికిన వాక్యాలు మొగిలిరేకు చివరల వంగిన ముల్లులా గీరేశాయి ప్రకాశం శరీరాన్ని. పిల్లదాని వెన్నుమీద చెయ్యివేసి నిమిరాడు.

[ఫెయిర్ రాస్తూండగా భామతి కన్నులు ఏ వాక్యం మీద బాష్పకణాన్ని వదిలాయో అక్కడే] హేమలత కన్నులు కూడా చెమ్మగిల్లాయ్.

"నిన్న సాయంత్రమేం నాన్నా అమ్మతో చదువుకుందిట - ఆవిడ పే రేవరు రంగా, చెప్తా ఉండు ... శోభారాణి [illegible]

కాదమ్మా! ఆఁ... లక్ష్మి ... ఆవిడ కనపించి - "ఏమే సుశీ! మీ అమ్మ అలా నల్లబడిపోతూ చిక్కుతున్నట్టుంది. ఆరోగ్యం బావుండటంలేదా!"

అని మాంచి బాగా సాగతీసుకుని వీణ తీగలా అడిగింది. ఇంటికొచ్చాక అమ్మ నడిగితే ఆవిడకు దృష్టి దోషం - డాక్టరు శాస్త్రిగారిని కలుసుకోమనూ అంది. నిజమేనా, నాన్నా?" అంది - తండ్రి వెన్నుమీద తల ఆనించి.

ఈసారి ప్రకాశం కన్నుల నుంచి జారిన బిందువులు కంచంలోనే పడటం రంగడు పసిగట్టాడు.

"నువ్వు మాట్లాడుతుంటే నాన్న అన్నం తినడంలేదు!" ఎంత గంభీరంగా పలికాడో, అంత గద్గదంగానూ ఉంది వాడి కంఠం.

"నీ మొహం, వెర్రి నాగమ్మా! దాన్ని చెప్పనివ్వరా! చెప్పవమ్మా చెప్పు!" తెచ్చిపెట్టుకున్న నవ్వుతో అన్నాడు ప్రకాశం.

"కాదు, నాన్నా! నీతోనూ, అమ్మతోనూ మాట్లాడటానికే భయంగా ఉందన్నాడు రంగడు!".

[మంచం మీద పడుకుని విన్నప్పుడు భామతి శరీరం ఎంత బాధపడి కుంచించుకుపోయిందో, చదువుతున్నప్పుడు హేమలత హృదయమూ అన్ని ముడతలు పడిపోయింది.]

"అంతే కాదు, నాన్నా! మీ రిద్దరు సంపాదిస్తున్నారు. ఏ నెలా ఆఖరు రోజుల్లో ఇంట్లో డబ్బు మిగలటంలేదు. పైగా అమ్మ తెచ్చే జీతం ట్యూషన్ మాస్టారికీ, సంత చేసేవాడికి సరిపోతుంది. మనం ఇంటిదగ్గర లేనప్పుడు పుల్లమ్మగారు మన పరాలి చేత పప్పులూ, ఉప్పులూ రవాణా చేయించేస్తోంది. ఏది ఎలా పడిసినా మనిద్దరి సుఖం కోసం అమ్మ ఉద్యోగంలో చేరుతానంది కదా! అదేమన్నా ఆదా! అని రంగడు చెప్పాడు నాన్నా!"

సుశీల ముగించకుండానే రంగడు తండ్రి తొడ మీద తల ఆనించి కళ్లు, ముఖం ఏకం చేసుకున్నాడు. సుశీల రెండో వైపున తల వంచి ఏడవసాగింది.

## స్తోమత

"ఇవాల్టి నుండి నువ్వు తాగుడు, సిగరెట్లు మానెయ్యాలి. తిండి ఒక్కపూటే తినాలి. సినిమాలు అస్సలు చూడకూడదు. పేకాట, రేసులు ఆడకూడదు" చెప్పాడు డాక్టర్.

"ఇవన్నీ చేస్తే నా జబ్బు తగ్గిపోతుందా డాక్టర్‌గారు?" అడిగాడు పేషెంట్.

"ఇవన్నీ జబ్బు తగ్గడానికి కాదు చెప్పడం, నే చెప్పినవన్నీ చేస్తే నాకు బిల్లు కట్టడానికి తగిన స్తోమత ఏర్పడుతుంది. అది ఏర్పడగానే నీకు ట్రీట్‌మెంట్ మొదలుపెడతాను" చెప్పాడు డాక్టర్.

## సిల్వర్ జూబ్లీ

"ఇవాళ మా పనిమనిషి తాలూకు సిల్వర్ జూబ్లీ జరుపుకుంటున్నాం!"

"అంటే? ఆమే గత 25 ఏళ్ళుగా మీ ఇంట్లో పనిచేస్తున్నదా?"

"అబ్బే, ఈ సంవత్సరంలో ఆమె 25వ పనిమనిషి."

పి.సురేష్‌కుమార్ [హైదరాబాద్]

పిల్ల లిద్దరి మీద చెరో చెయ్యీ వేసి బెంబేలయిపోయాడు ప్రకాశం. రెండువేలమంది విద్యార్థులు ఉద్రిక్తులైతే ప్రశాంతంగా ఉపశమన వాక్యాలతో వారిని లాలించగలిగిన ప్రకాశం ఇద్దరు పిల్లల కన్నీళ్లకు లొంగిపోయాడు.

బరువుగా తల పైకెత్తి చూసింది, మంచం మీద భామతి. ఆమె శరీరం నిండా తేళ్లు, జెర్రులూ పరువులెడుతున్నాయి. అతి ప్రయత్నం మీద మంచం దిగి అడుగులేసి గడపలోకి వచ్చి నిలబడింది.

రాహుగ్రస్త చంద్రబింబంలా మ్లానమై ఉంది విషాద రసాప్లావిత భామతీ వదనం.

బహుళ ద్వాదశీ చంద్రరేఖలా ఉంది నుదుటి మీద తిలకం. ప్రకాశం గంభీరుడు కాగలిగాడు.

"ఇలా వచ్చి కూర్చుంటావా? పిల్ల లేదో తెలియక అంటూంటే నువ్వంత బాధపడటం దేనికి? ఇన్నాళ్లు వాళ్లను అంత గారాబంగా పెంచాం. ఇప్పు డీ అవస్థను వాళ్లు భరించలేకపోతున్నారు!" ప్రకాశం గొంతు పిడలేదు.

ప్రళయకాల ప్రభూత ప్రచండానిలవేగ తీవ్ర సంచలిత సంక్షుభిత సాగరోత్తుంగ తరంగ శిఖర తాడిత, ప్రతాడిత బాలరసాల శాఖలా ఊగిసలాడిపోయింది భామతి శరీర సర్వస్వం.

గడప దాటలేదు భామతి - పిల్లలిద్దర్నీ నడిపించి తల్లిదగ్గరకు తీసుకొచ్చాడు ప్రకాశం.

భర్తను ఆసరా చేసుకుని నేలమీద కూలబడి పిల్ల లిద్దరి తలలూ ఒడిలో నిమురుకుంది భామతి.

తమ మీది ప్రేమతో జారిన తల్లి కన్నీటి కణాలు పిల్లల శిర్సాలపై పడి వాళ్లకు పులకెత్తించాయి.

ప్రకాశం కన్నులు పొడారినా నవ్వుతూనే చూశాయి భామతిని. భామతి కన్నులలోని విషాదానికి ఉపశ్రుతి కాకుండా ఆమె పెదవులు నవ్వినాయి.

[హేమలత భారంగా నిట్టూర్చి, సంతృప్తిగా శ్వాస తీసుకుని అమాయకంగా గుండెలమీద చేతులుంచుకుని ఒక్కసారి కనులు మూసి ఏ అనంత శక్తికో ఆత్మ ప్రదక్షిణం చేసింది.]

★

